క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశానికి 25 చివరి తేదీ

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2023– 24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులు ఈనెల 25 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ఒక్కో విభాగంలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు tsms.cgg.gov.in దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు పత్రం, ఎస్‌ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు జీరాక్స్ కాపీలను పాఠశాల కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

మాదిగలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

నడిగూడెం : రానున్న ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేపడుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, వర్గీకరణపై బిల్లును ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట పందిటి నవీన్, గంటె పంగు నమృత్, భార్గవ్ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

కోదాడరూరల్ : ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వెలిది పద్మావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దోరకుంట శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు టెంట్ సౌకర్యం, తాగునీటి వసతితో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సతీష్, ఏడుకొండలు, కూలీలు తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహకం


విద్యార్థినికి నగదు అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన హుజూర్‌నగర్ విద్యార్థిని సీఎస్‌వీ వైష్ణవిదేవికి గురువారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రోత్సాహకంగా రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భగా పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో వైష్ణవిదేవిని ఆమె తల్లిదండ్రులను శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైష్ణవిదేవి ఉన్నత చదువుకు ఎలాంటి లోటు రాకూడదని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జూలకంటి నర్సిరెడ్డి, కె.వీరారెడ్డి, కేవీఎన్ మూర్తి, నర్సయ్య, ఎంఎస్ఎన్ రాజు, ఎస్.వెంకటేశ్వర రావు, మోహనరావు, ఎల్‌వీ ఎల్, పురుషోత్తం, చంద్రయ్య, కోటయ్య, రమా ంజయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో గురువారం వైశాక మాస శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాయప్రోలు భద్రయ్యశర్మ, రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాయప్రోలు ఉపేందర్‌శర్మ, రాళ్లబండి జ్ఞానసాయిలు వేదమంత్రోచ్చాల మధ్య స్వామివారికి సుప్రభాత సేవ, మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, సహస్రనామ అర్చన, కుంకుమార్చన, అభిషేకాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి దర్శించుకున్నారు.

అధ్యక్షుడిగా కరుణాకర్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల మున్నూరుకాపు యువక మండలి అధ్యక్షుడిగా పర్సాయపల్లికి చెందిన కదారి కరుణాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్, జిల్లా యువక మండలి అధ్యక్షుడు నల్లగుంట్ల సందీప్, పర్సాయపల్లి సర్పంచ్ పుప్పాల శేఖర్ గురువారం సూర్యాపేటలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి సన్మానించారు. పి.ప్రభాకర్, సోమశేఖర్, రవికాంత్, ఏకస్వామి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో ఇక్కడ.. నిర్వహణ అక్కడ

- మునగాలలో స్థలం లేక గురుకుల పాఠశాల నెమలిపురికి తరలింపు
- ఏడేళ్లుగా సొంత భవనం కరువు
- దాతల సహకారంతోనే వసతులు
- పాఠశాలను మునగాల మండలంలోనే ఏర్పాటు చేయాలని వేడుకోలు


కోదాడ మండలం నెమలిపురిలో కొనసాగుతున్న గురుకుల పాఠశాల

మునగాల : మునగాల మండలానికి మంజూరైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఏర్పాటుకు ఇక్కడ సరిపడ స్థలం లేకపోకవడంతో అధికారులు ఏడేళ్ల క్రితం కోదాడ మండలం నెమలిపురి గ్రామానికి తరలించారు. దీంతో నాటి నుంచి నేటివరకు ఈ పాఠశాల నెమలిపురిలోనే కొనసాగుతోంది. అయితే పాఠశాల రికార్డులో మాత్రం మునగాలలోనే ఉన్నట్లుగా ఉంది.

ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగింపు..

కాగా 2016లో మునగాలకు చెందిన ప్రస్తుత రిటైర్డ్ ఐఏయస్ అధికారి ఎంవీరెడ్డి ఎస్సీ కార్పొరేషన్‌లో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న కాలంలో గురుకుల పాఠశాలను మంజూరు చేయించారు. కానీ మండలంలో పాఠశాల ఏర్పాటుకు ఐదు ఎకరాల స్థలం లేకపోవడంతో ఒక ఏడాది పాటు చివ్వెంల మండలంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించారు. అనంతరం 2017లో పాఠశాలను నెమలిపురి గ్రామానికి తరలించారు. అయితే నెమలిపురిలో విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంలో గురుకుల పాఠశాలను 5, 6,7 తరగతులతో ప్రారంభించారు. అటు పిమ్మట 8, 9, 10 తరగతుల స్థాయికి పెంచారు. అయితే అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు నానా ఇక్కట్లకు గురువుతున్న సమయంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాతల సహకారంతో తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మించారు. అంతేకాకుండా ఈ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో ఉన్నతాధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 540 మంది విద్యార్థులతో కొనసాగుతోంది. పూర్తిస్థాయిలో వసతి ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల ప్రకటించిన టెన్త్ ఫలితాలలో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి, 9.5, 9.2, 9.0 జీపీఏలతో ముందంజలో ఉన్నారు. అంతే కాకుండా ఈ పాఠశాలలో గత ఏడాది ఇంటర్ విద్యను కూడా ప్రవేశపెట్టారు. అయితే మునగాలకు మంజూరైన ఈ పాఠశాలను తిరిగి మునగాలకే తరలించే విధంగా ఏర్పాటు చేయాలని పలువురు విద్యావంతులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాతల సహకారంతో సౌకర్యాలు



మునగాల మండలానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రస్తుతం కోదాడ మండలం నెమలిపురిలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతోంది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో దాతల సహకారంతో విద్యార్థులకు కావల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఉన్నతాధికారులు ఈ పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి నిధులు మంజూరు చేయాలి.

– గజ్జి వెంకటేశం, ప్రిన్సిపాల్, నెమలిపురి

పాఠశాలను మునగాలకు తరలించాలి



మునగాలకు మంజూరైన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మునగాలకు తరలించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలి. మునగాల పరిధిలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు నష్టపోకుండా వచ్చే విద్యా సంవత్సరానికి మునగాలలో ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– గుగులోతు శివ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, మునగాల

ప్రజాప్రతినిధులు నడుం బిగించాలి



నెమలిపురిలో ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాలను మునగాలకు తీసుకురావాలంటే ప్రజాప్రతినిధులు నడుం బిగించాలి. ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల మీద ఒత్తిడి తీసుకువచ్చి మండలంలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేయాలి.

– ఎండీ.సలీమ్ షరీఫ్, మండల విద్యాధికారి, మునగాల

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి


రాయినిగూడెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ములకలపల్లి రాములు

గరిడేపల్లి : ఉపాధి హామీ కూలీలు గత సంవత్సరం చేసిన పనికి నేటికీ వేతనాలు విడుదల చేయలేదని, తక్షణమే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. గత ఏడాదిలో పనిచేసిన రెండు నెలల వేతనాలు రాలేదని, ఈ సంవత్సరంలో నాలుగు వారాలుగా పనిచేస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలో కూలీ పనులు చేస్తున్నప్పటికీ సమయానికి వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించేవిధంగా చొరవ తీసుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మైబెల్లి, జిల్లా కమిటీ సభ్యులు దోసపాడు భిక్షం, ఉపాధి హామీ మేట్లు నాగమ్మ, వెంకటమ్మ, కూలీలు ఉన్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

నేరేడుచర్ల : సీఎం కప్– 2023 మండల స్థాయి విజేతలకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం కప్ క్రీడలను మండల స్థాయిలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నవీన్‌కుమార్, ఎంపీఓ విజయకుమారి, ఎంఈఓ చత్రునాయక్, సర్పంచ్‌లు పల్లెపంగ నాగరాజు, తాటికొండ అమృతారెడ్డి, మార్కెండేయ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఆడ పిల్లలపై చిన్నచూపు తగదు

ఆత్మకూర్ (ఎస్) : ఆడపిల్లలపై చిన్న చూపు తగదని, ఆడపిల్లలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణించగలరని జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏనుబాముల గ్రామంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లితండ్రులు ఆడపిల్లలను చిన్నచూపు చూడవద్దని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని, అవకాశాలు కల్పిస్తే పురుషుల కంటే ఏ రంగంలోనూ తీసిపోరని అన్నారు. ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎఫ్ ఆర్గనైజర్ నాయిని సైదులు, ఎస్ఎంసీ చైర్మన్ యాదమ్మ, కిశోర బాలికలు స్పందన, ముదిగొండ వర్షిత, సుద్దాల సాయిసుధా, గంపల అక్షిత, పావని, రిషిత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి స్థలాల పరిశీలన


గుడిబండలో స్థలం పరిశీలిస్తున్న డాక్టర్ కల్యాణ్, అధికారులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు పీహెచ్‌సీ పరిధిలో గల గుడిబండ, తొగర్రాయిలో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మాణ కమిటీ సభ్యులు గురువారం స్థలాలను పరిశీలించారు. అనంతరం నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడారు. ఉపకేంద్రాల నిర్మాణానికి గ్రామపంచాయతీ తీర్మానం చేసి ఇచ్చిన ప్రదేశాలను పరిశీలించి స్థలాల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అనంతరం ప్రజలకు అందుబాటులో ఉండే అనువైన స్థలంలో మూడు నెలల్లో భవనాలు నిర్మించేందుకు టీఎస్‌ఎంఐడీసీ అధికారులు పనులు మొదలు పెడతారని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీఓ విజయశ్రీ, పీఆర్ ఏఈ రాము, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ సుష్మ, నాయకులు ఉన్నారు.

నిరుపయోగంగా చేతిపంపు


నారాయణపురం ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేతిపంపు నిరుపయోగంగా ఉంది. గ్రామంలో మిషన్ భగీరథ నీరు, గ్రామ పంచాయతీ ట్యాంక్ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. చేతిపంపుకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు ఫుల్.. సదుపాయాలు నిల్

- చిలుకూరులో పేరుకుపోయిన సమస్యలు
- అధ్వానంగా లింకు రోడ్లు
- మంజూరుగాని 'డబుల్' ఇళ్లు
- మండల కేంద్రమైనా గురుకుల, మోడల్ స్కూల్స్, జూనియర్ కళాశాల లేవు


కంకర తేలి అధ్వానంగా మారిన చిలుకూరు - ఆర్లెగూడెం లింకు రోడ్డు


గుంతలమయంగా చిలుకూరు- రామ్‌చంద్రానగర్ రోడ్డు

చిలుకూరు : చిలుకూరులో సమస్యలు తిష్ఠ వేశాయి. పేరుకే మండల కేంద్రం అయిన ఎలాంటి సదుపాయాలు లేవు. గ్రామంలో దీర్ఘకాలంగా సమస్యలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో నేటివరకు మోడల్ స్కూల్ కానీ, కస్తూరిబా పాఠశాల కాని, గురుకుల పాఠశాల లేదు. మండల ప్రజలు ఎప్పటి నుంచో జూనియర్ కళాశాల కోసం ఎదురు చూస్తున్నా అతిగతి లేదు. అలాగే ఎస్సీ, ఎస్టీ కళాశాల హాస్టల్‌కు పక్కా భవనం నిర్మించలేదు. దీంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నడిపిస్తున్నారు. అలాగే గ్రామంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో గ్రామంలో దాదాపుగా ప్రతి ఇంట్లో గేదెలు ఉంటాయి. కాగా చిలుకూరు పశువైద్య కేంద్రంలో ఒకే ఒక డాక్టర్ ఉండటంతో పశువుల చికిత్సకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వేబ్రిడ్జి కాంటా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉచిత కాంటా వేబ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'డబుల్' ఇళ్ల జాడేదీ..

చిలుకూరు గ్రామానికి నేటికీ డబుల్ బెడ్ ఇళ్లు మంజూరు కాలేదు. చుట్టుపక్కల గ్రామాలకు ఇళ్లు మంజూరై నిర్మాణాలు కూడా పూర్తై పంపిణీలు జరుగుతున్నా చిలుకూరుకు దిక్కే లేదు. చిలుకూరులో స్థలం ఉన్నా డబుల్ బెడ్ ఇళ్లు మంజూరు కాకపోవడంతో ఇళ్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా హరిజవాడ వాసులు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా లింకు రోడ్లు..

చిలుకూరు నుంచి పలు గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు, రామచంద్రానగర్ వెళ్లే రోడ్డు, చిలుకూరు హరిజనవాడ నుంచి నారాయణపురం (తాళ్లబాట) గంతలమయంగా మారాయి. ఈ రోడ్డుకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే చిలుకూరు శివాలయం నుంచి బేతవోలు రోడ్డును బీటీగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. రావినారాయణరెడ్డి కాలనీకి మరో రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి



ఆర్లెగూడెం రోడ్డులో గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో ఆ దారిలో గల మా పొలాలకు బైక్ వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నాం. వర్షం వస్తే ఆ రోడ్డులో వెళ్లే పరిస్థితి లేదు. అయితే చిలుకూరు నుంచి ఆర్లెగూడెం లింకు రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని చెబుతున్నారు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు. తక్షణమే రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– పిల్లుట్ల రమేష్, చిలుకూరు

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

- డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి


పోలీస్, ఎక్సైజ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

హుజూర్‌నగర్ : అక్రమ సారా, బెల్లం వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ అధ్వర్యంలో నియోజకవర్గంలోని పోలీస్, ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలతో క్రైమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ వారీగా సారా తయారీదారులను, రవాణాదారులను, ముఖ్యంగా బెల్లం, పట్టిక రవాణాదారులను గుర్తించి వారిని తక్షణమే బైండోవర్ చేయించాలని ఆదేశించారు. ఇక నుంచి అటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి ఎక్సైజ్ అధికారులతో సంయుక్తంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. నియోజకవర్గంలో సారా తయారీకి బెల్లం, పట్టిక సరఫరా చేసే వ్యక్తులకు కిరాణ షాపు యాజమానులు వాటిని అమ్మకూడదని హెచ్చరించారు. ఉద్ధేశపూర్వకంగా నల్లబెల్లం, పట్టిక రవాణా చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డీఎస్పీ ఆదేశించారు. సారా వల్ల ప్రజల ఆరోగ్యానికి హానితో పాటు ప్రభుత్వ ఆదాయం కోల్పోతుందని తెలిపారు. సారా నిర్మూలనలో ఎక్సైజ్ శాఖకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం అందిచాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి, నియోజకవర్గంలోని ఎక్సైజ్, పోలీస్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి మృతి తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి


సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యంగళ్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపాలపురంలో సత్యనారాయణరెడ్డి దశదిన కర్మలో ఆమె పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, బెల్లంకొండ గురవయ్యగౌడ్, జక్కుల మల్లయ్య, బ్రహ్మం, సత్యనారాయణ, కటుంబసభ్యులు తదితరులు ఉన్నారు.

తారు రోడ్డు మంజూరు చేయాలని నిరసన


చెవ్వోరిగూడెం రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో గల చెవ్వోరిగూడెంకు వెళ్లే దారిని తారు రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా కన్వీనర్ రాపోలు నవీన్‌కుమార్ మాట్లాడుతూ సుమారు నాలుగు మండలాలను కలుపుకొని వెళ్లే ఈ రోడ్డుకు తారు రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి తారు రోడ్డు వేయకుంటే గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు బీఎస్పీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపంగ ఉపేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామస్వామి, కల్యాణ్ వర్మ, హరీష్‌రావు, సతీష్, తిప్పన శ్రీనివాస్‌రెడ్డి, అచ్చిరెడ్డి, లచ్చిరెడ్డి, బ్రహ్మాచారి, పరిపూర్ణాచారి, లచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఎన్నికల సన్నాహక సమావేశం


సిరిపురంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నడిగూడెం : కోదాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి కోరారు. గురువారం సిరిపురం, వేణుగోపాలపురం గ్రామాలలో సన్నాహక సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించి అనంతరం ఆయా గ్రామాలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్, సిరిపురం, కరివిరాల సర్పంచ్‌లు మొక్క లక్ష్మీవీణ, గుర్రం నీలిమా గాంధీ, నాయకులు మొక్క భిక్షపతి, శెట్టి సతీష్, ఎలుగూరి నాగరాజు, వీరయ్య, సోమయ్య, రేపాల పురుషోత్తం, ఉపేందర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై కళాజాతా


బరాఖత్‌గూడెం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేష్

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో స్థానిక ఎస్‌ఐ పిల్లి లోకేష్ రోడ్డు ప్రమాదల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో రోడ్డు నియమ నిబంధనలు, సైబర్ నేరాలపై, షీ టీమ్స్, మానవ అక్రమ రవాణ, మహిళలు, పిల్లల భద్రత, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. 100 డైల్ గురించి, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్, టోల్‌ఫ్రీ నెంబర్ 1930, సెల్ ఫోన్ వలన కలిగే అనర్థాలు, యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మునగాల సీఐ పి.వీరరాఘవులు, జీఎమ్మార్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐలు కృష్ణమూర్తి, మల్సూర్, సూర్యాపేట షీటీమ్ ఎస్‌ఐ బాలునాయిక్, షీటీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జాఫర్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ మహేశ్వరి, పోలీసు సిబ్బంది, పోలీసు కళాజాత బృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, గురులింగం, నాగార్జున, గ్రామప్రజలు పాల్గొన్నారు.

నీటితొట్ల నిర్వహణపై నిర్లక్ష్యం


కందిబండలో నిరుపయోగంగా నీటి తొట్టి


హేమ్లాతండాలో..

- నిరుపయోగంగా నీటితొట్లు
- తాగునీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మేళ్లచెరువు : మండలంలోని గ్రామాల్లో పశువులు, మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. ఎండలు విపరీతంగా ఉండటంతో కుంటలు, బావులు సైతం ఎండిపోయాయి. దీంతో గ్రామాల్లో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. అయితే ప్రభుత్వం పశువుల దాహార్తిని తీర్చేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లోని శివారుల్లో ఒక్కో నీటి తొట్టికి ఇరవై వేల రూపాయల నిధులు ఖర్చు చేసి నిర్మించింది. కానీ వాటిలో నీరు పెట్టకపోవడంతో అవి వృథాగానే ఉంటున్నాయి. కొన్నిచోట్ల నీటితొట్లు శిథిలావస్థకు చేరాయి.

లక్షలు ఖర్చు చేసి..

మండలంలో గతంలో ఒక్కో గ్రామంలో రెండు నుంచి మూడు నీటితొట్లు నిర్మించారు. మండలవ్యాప్తంగా 50కి పైగా నిర్మించారు. వీటిని నిర్మించేందుకు సుమారు 15 నుంచి 20 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. నీటి తొట్లలో నీటిని నింపేందుకు పైపు లైన్‌లకు కూడా అమర్చారు. కానీ వాటి నిర్వహణపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడంతో నీటితొట్లు అధ్వానంగా తయారయ్యాయి. గతంలో నిర్మించిన నీటి తొట్లకు మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరగా.. ఇప్పుడు నిర్మించినవి సైతం నిరుపయోగంగానే ఉన్నాయి. అలాగే కొన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు నీటి తొట్ల నిర్మాణానికి నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇవ్వడంతో వాటి పనులు పూర్తికాకుండానే మధ్యలోనే వదిలి వేయడంతో వాటి నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకరావాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మా గ్రామంలో నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో వేసవిలో మూగజీవాలు తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. అధికారులు చొరవ చూపి నీటి తొట్లలో నీరు ఉండేలా చూడాలి.

– షేక్ అబ్దుల్ రషీద్, కందిబండ